మంచిపనిచేస్తే అది చూసిసంతోషించే స్థాయిఅయినా మనకు ఉండాలి. నీవు సత్పురుషుడవు అవ్వనక్కరలేదు, సత్పురుషుడిని చూసి సంతోషించేస్థితి నీకు లేనప్పుడు సద్వస్తువును ఎలా పొందగలవు. ఉన్నదేదో నీహృదయంలో ఉంది. నీవుఉంది అనుకొన్నప్పుడు, లేదుఅనుకొన్నప్పుడుకూడా అది ఉంది. నీవుఎన్ని ఉపాయాలు ఆలోచించు, ఏదోమార్గంలో ప్రయాణించు, ఏదోగురువు దగ్గరట్రైనింగ్‌పొందు , అహంభావన నశించిన మరుక్షణంలో లోపలఉన్నసత్యవస్తువు నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 24-2-03, సఖినేటిపల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రస్తుతం మనకు జబ్బుచేసింది అనుకోండి. ఈజబ్బు తగ్గించుకోవటం మంచిదే ఈజబ్బు తగ్గించుకొన్నా మరల 10 రోజులకు కొత్తజబ్బు వచ్చేస్తే ఏమీ ప్రయోజనంలేదు. కొత్తజబ్బులు రాకుండా చూసుకోవాలి. మీరు పూజచేయవచ్చు, జపంచేయవచ్చు, ధ్యానం చేయవచ్చు. ఎన్నిచేసినా నేను అనే తలంపు, నాది అనే తలంపు ఇవి రెండూ పూర్తిగా నశించేవరకు మీకు తాత్కాలికంగా ఏదైనా ఆనందం రావచ్చు, శాంతి రావచ్చు అది నిలబడదు, మరల అశాంతివచ్చేస్తుంది. అందుచేత ఇవి రెండూ పరిష్కారం చేసుకోవాలి. నేను, నాది అనేవి రెండూ నిజంకాదు, ఇవి తలంపులే, వీటిలోనుండి విడుదల పొందటమే నీసాధన యొక్కగమ్యం. ఇవిరెండూ దేహంచుట్టూ తిరుగుతూ ఉంటాయి. నీకు గాఢనిద్రలో నేను అనే తలంపులేదు. అక్కడ చూచేవాడులేడు, చూడబడేవి లేవు. ఈచూచేవాడు ఎంత అసత్యమో చూడబడేవి కూడా అంతే అసత్యం. ఇవి సత్యం అనుకోవటం వలన నీకు తొందరపాటు వస్తోంది, ఉద్రేకపడుతున్నావు, దుఃఖానికి గురిఅవుతున్నావు. ధ్యానంచేయుటం వలన నీకు తాత్కాలికంగా ఆనందంరావచ్చు కాని ఈ నేను అనే సమస్య పరిష్కారం అయ్యేవరకు ఆనందం శాశ్వతంకాదు. అందుచేత ఈసమస్యను ఇప్పడే, ఇక్కడే పరిష్కారం చేసుకోవాలి. నేను అనేది కూడా ఒకతలంపు, అదిమూలతంపు అది వచ్చాక మిగతావన్నీ వస్తున్నాయి. ఈమూలతలంపు నీలోపల నుండేవస్తోంది. అది ఎక్కడ నుండి వస్తోంది అని దానిని విచారణ చెయ్యి. మిగతా తలంపుల నుండి ఈ మూలతలంపును వేరుచేసి, అది ఎక్కడ నుండి ఉదయిస్తోంది అని సాత్వికగుణంతో, ఓర్పుతో, నేర్పుతో, శాంతితో అన్వేషణ చేస్తూ ఉంటే అదిలోపలకు ఉపసంహరింపబడుతుంది. చీకటి అంతా ఈమూలతలంపులోనే ఉంది. నీకు ఎంత ధనంఉన్నా, విద్యఉన్నా, అధికారంఉన్నా



ఈమూలతలంపులోనుండి విడుదలపొందితే గాని నీవు చీకటిలోనుండి, అజ్ఞానంలోనుండి బయటకు రాలేవు. నేను అనే తలంపు రోజూ ఏవో గొడవలు వేసుకొని వస్తుంది. ఆగొడవలు ఎలా పరిష్కారం చేసుకోవాలి అని ఆలోచించుకొంటూ కూర్చొంటున్నాము. ఈలోపుగా దేహానికి చావువచ్చేస్తుంది. ఇంకమన ట్రైనింగ్ సున్న, మనంఫెయిల్ అయిపోతున్నాము. నేను అనే తలంపు వేసుకొని వచ్చే గొడవలనుండి తప్పకోవటానికి ఏదో కొద్దిసేపు ధ్యానం చేస్తారు అనుకోండి, శాంతిగా ఉంటుంది అనుకోండి మంచిదే కాని అది మరల కొత్తగొడవలు వేసుకొని వస్తుంది., దానికి అంతకంటే పనిలేదు. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే మీకు ఒక జబ్బు వచ్చింది, తగ్గించుకోవటానికి చూస్తున్నారు, మంచిదే కాని మరల కొత్త జబ్బులు వచ్చేస్తూ ఉంటే ఎలాగ? సాధనచేసి ఒకగోతిలోనుండి బయటకు రావటం మరల ఇంకో గోతిలో పడటం ఇలా ఎన్నాళ్ళు ప్రకృత్తిలో తిరుగుతారు. నేను అనే తలంపు ఏదో గొడవలు వేసుకొని వస్తుంది, దాని గొడవలోఅది ఉంది, మనగొడవ మనం చూసుకొందాము అని దానివంక చూడటం మానేసి, దానిచుట్టూ తిరగటం మానేసి హృదయంవైపుకు చూచుకొందాము అనే బుద్ధి మనకు రావటంలేదు. దానికి పుణ్యబలం ఉండాలి, సాధనాబలం ఉండాలి. ఎప్పడూ ఈనేను తీసుకొని వచ్చేసమస్యల వంక చూడటం, ఏడవటం. ఎప్పడూ అటుచూసేబదులు మీ హృదయంలో ఒక నిజం ఉంది, దానివంక మధ్య మధ్యలో చూడండి, మీకు శాంతి దొరుకుతుంది అని చెపుతున్నారు. గాఢనిద్రలో నీకు నేను అనే తలంపు లేదు, నాది అనే తలంపులేదు కాని నీవుఉన్నావు. నేను అనే తలంపు, నాది అనే తలంపు లేకుండా నేను ఉండలేను అని నీవు అనుకొంటున్నావు అందుచేత నీకు భయంకలుగుతోంది. రాముడువచ్చి వెళ్ళిపోయాడు, కృష్ణుడు వచ్చి వెళ్ళిపోయాడు అనుకోవటం, వర్తమానకాలంలో ఉన్న మహర్షులను వదులుకోవటం, ఇదేమాయ. మూలతలంపు మూలంలోనికి వెళ్ళటానికి మీరు త్రికరణశుద్ధిగా, కపటం లేకుండా అన్వేషణ చేస్తూఉంటే ఈజన్మలోనే మీరు పొందవలసింది పొందుతారు. మూలతంపుదాని మూలంలో అణగటం, అది నశించటం, అక్కడఉన్న నిజం నీకు స్వరూపంగా వ్యక్తమవ్వటం ఒకేసారి జరిగిపోతాయి.

నాహృదయంలో ఒకనిజం ఉంది. గురువు సహాయం లేకుండా, భగవంతుడి సహాయం లేకుండా, మహర్షుల సహాయం లేకుండా నా అంతట నేనే దానిని పొందటానికి ప్రయత్నం చేస్తున్నాను, సఫలం అవుతుందా అని అడుగుతున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే నీహృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవాలనే తలంపు నీకు వచ్చింది అంటే దేవుని

దయ లేకుండా ఆతలంపుకూడా నీకు రాదు అంటున్నారు. ఆత్మాన్వేషణ చేయాలనే కోరిక కలగటమే ఈశ్వరుని కృప అంటున్నారు. పిడత ఏమిచెపుతోంది. నాకు ఇప్పడు ఆనందంగా లేదుమట్టిలో కలిసిపోతాను అంటోంది. అలా చెప్పేటప్పడు కూడా అది మట్టిలోనే ఉంది కాని దానికి మట్టితో తాదాప్యం లేదు పిడత రూపంతో నామంతో తాదాప్యం వచ్చేసింది. అది మట్టిలోనే ఉండి మట్టిలో కలిసిపోతాను అంటోంది. మనం కూడా అంతే ఆత్మలోనే ఉండి ఆత్మను తెలుసుకోవాలి అంటున్నాము. అది మట్టిలోనే ఉండికూడా నేను మట్టిలోలేను అని పిడత అనుకొంటోంది. మనంకూడా ఆత్మలోనే ఉండి ఆత్మలో లేము అనుకొంటున్నాము అందువలననే అశాంతి వస్తోంది. ఏదోసాధనలు చేస్తున్నాము అనటంకాదు ఏమిటి మీరు చేసేసాధనలు? ముందువిషయం అర్ధంచేసుకోండి, తరువాత సాధనలు చేయవచ్చు. మట్టిలోనే ఉండి, మట్టికంటే భిన్నంగా ఉన్నాను అనే తలంపు దానికి ఎందుకు వచ్చింది? రూపంతోటి, నామంతోటి తాదాప్యం వలన అలా అనుకొంటోంది. మనం కూడా అంతే మన నామరూపాలతో తాదాప్యం వలన ఆత్మలోనే ఉండి ఆత్మలో లేము అనుకొంటున్నాము. చైతన్యం నీహృదయంలోనే ఉంది. ఇప్పడు మనం ఆలోచిస్తున్నాము అంటే చైతన్యం యొక్క సపోర్టు వలననే ఆలోచిస్తున్నాము అయితే మన ఆలోచనలకు చైతన్యానికి సంబంధంలేదు. నావాసనను బట్టినేను ఆలోచిస్తాను, మీ వాసనను బట్టి మీరు ఆలోచిస్తారు కాని ఈ ఆలోచనలకు చైతన్యానికి సంబంధంలేదు. ఆలోచనా విధానం అనేది జీవుడికి సంబంధించినది. మీరు ఒక పనిచేసారు అనుకోండి, దానికి ఈశ్వరుడు ఫలితం వెంటనే ఇవ్వడు. ఆకర్మఫలం ఎప్పడు మీకు అనుభవంలోనికి రావాలి, ఏజన్మలో అది మీకు ఇవ్వాలి అని నిర్ణయించే వాడు ఈశ్వరుడు. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఈకర్మను అనుభవించేవాడు ఎవడు? మూలతలంపే, వాడిని దాటివెళ్లిపో. నువ్వు ఏఅనుభవంఅయితే పొందుతున్నావో ఆపొందేవాడు ఎంతనిజమో, ఆఅనుభవంకూడా అంతే నిజం. ఈరెండూ అసత్యాలే. వీటిని వదిలెయ్యి ఇక్కడే కూర్చున్నావా అసలువస్తువు నీకు దొరకదు. నేనుకర్మ అనుభవిస్తున్నాను అని అనుకొంటూ ఇక్కడేఉంటే ఇంక నీమనస్సు ఎప్పడు లోపలకు వెళుతుంది. వారు లోపల నుండి రమ్మనిపిలుస్తున్నారు, వారి ఆహ్వానం ఎప్పడూ ఉండనే ఉంది. నువ్వు గడపదాటి లోపలకు వెళ్లకుండా బయటనుంచున్నావు. లోపలకు వెళ్ళటానికి నీవు ప్రయత్నం చేయటంలేదు. నీవు ప్రయత్నం రవ్వంత, ముల్లంత చేస్తే సరిపోతుంది. మిగిలిన పనిఆయనే చూసుకొంటాడు. వారికి సరిగా మర్యాద చేయలేదు, వీరికి సరిగా మర్యాద చేయలేదు. వారు ఏమనుకొంటారు, వీరు ఏమనుకొంటున్నారు అనుకొనేది ఎవరు? నేను అనుకొంటోంది. ఆ నేను అణిగిపోతే వారులేరు, వీరు లేరు. ఈక్లూ అర్ధంకాకపోతే మీకు కోటిజన్మలు ఎత్తినా మోక్షంరాదు. భగవాన్ చెపుతూ ఉండేవారు మీకు ఎప్పడైనా ఎవరిమీద అయినా కోపంవస్తే వారిమీద కోపం పెట్టుకోవద్దు., మీమీద మీరే కోపంపెట్టుకోండి, ఆదొంగనేను మీద కోపం పెట్టుకోండి. ఇతరులమీద కోపం తెచ్చుకోవటం కాదు మీకోపం మీదకోపం తెచ్చుకోండి అనేవారు. నువ్వుశాంతిలోఉండి పనిచేస్తూఉంటే, ఆనందంలోఉండి పనిచేస్తూ ఉంటే నీశరీరం తొందరగా టైర్అవ్వదు. లోపల విసుగుదల ఉన్నప్పడు, లోపల అశాంతి ఉన్నప్పడు శరీరం తొందరగా టైర్అయిపోతుంది. రెండు చేతులు కలిస్తే చప్పట్లు, రెండు మనస్సులు కలిస్తే ముచ్చట్లు. మిమ్మల్ని చూసి నామొఖం అటుపెట్టుకొంటే, నన్నుచూసి మీమొఖంఇటుపెట్టుకొంటే ఇంక ముచ్చట్లు ఏమిటి? తెలియబడేవస్తువు అదితెలియబడటానికి ఎలా సిద్దంగా ఉందో అలా దానిని తెలుసుకోవాలనే కాంక్ష నీకు ఉన్నప్పడు యూనిటీ వస్తుంది. మీమీద నాకు ఎంత ప్రేమ ఉందో, నామీద కూడా మీకు అంత ప్రేమ ఉన్నప్పడే ఆస్నేహం నిలబడుతుంది.

జ్ఞానం కలగాలంటే గురువు అవసరమా అని అడుగుతున్నారు. రమణమహర్షి గారికి కూడా బాహ్యగురువు లేకపోయినా అరుణాచలేశ్వరుడే ఆయనకు గురువు. జె.కె. గారు గురువు అవసరం లేకుండా జ్ఞానం పొందవచ్చు అనిచెప్పారు అనిఒకరు భగవాన్‌తో అంటే ఆయనకు గురువు అవసరంలేకపోవచ్చు గాని యితరులకు ఎవరికీ గురువు అవసరంలేదని ఆయన ఎలా చెప్పగలరు అన్నారు భగవాన్. అంటే గురువు యొక్క అవసరాన్ని అంగీకరిస్తున్నారు. మనం భగవంతుడిని ఆరాధించగా, ఆరాధించగా ఆయనే ఒక శరీరం ధరించి గురువు రూపంలోవస్తాడు. ఈశ్వరుడు అన్నా, గురువు అన్నా, ఆత్మ అన్నా, ఒక్కటే. గురువు అవసరమా అయితే ఎంతకాలం అవసరం అని ప్రశ్న, ఇక్కడ భగవాన్ స్పష్టంగా చెపుతున్నారు. నీలో వ్యక్తిభావన ఉన్నంతకాలం, దేహాభిమానం ఉన్నంతకాలం, దేహమే ఆత్మఅనుకొన్నంతకాలం నీకు గురువు అవసరమే. నీవు ఆత్మవే అయితే ఆత్మను తీసుకొనివచ్చి నీదేహానికి పరిమితం చేస్తున్నావు. ఆపరిమితబుద్ధిని ఊడగొట్టటానికి గురువు అవసరమే. నీకు గురువు మీద ప్రేమ కలుగుతోంది అనుకో అదికూడా ఆయన దయే. దేహబుద్ధి పోయిన మరుక్షణంలో నీవు చైతన్యస్రవంతిలో ఐక్యమవుతావు. అప్పడు నీకు వ్యక్తిపరమైన ఆలోచన నశిస్తుంది. కొంతమంది పేచీలువస్తే వాటిని పెంచేస్తారు. కొంతమంది పేచీలు వస్తే వాటిని పెంచరు, వాటిని పరిష్కారం చేయటానికి చూస్తారు. అలా ఎవరైతే పరిష్కారం

చేస్తున్నారో వారు దేవునిదయకు పాత్రులవుతారు. ఈశ్వరునిదయకు పాత్రులేకాదు వారసులవుతారు. పిడతమట్టిలోనే ఉండి అది తెలియక మట్టికి భిన్నంగా ఉన్నాను అనుకొంటోంది. మట్టి కంటే భిన్నంగా ఉన్నాను అన్న సంగతి నిజంకాదు. అది ఒక తలంపు. ఆతలంపు పిడతకు దుఃఖాన్ని తీసుకొని వస్తోంది. ఆపిడతకథ మనకథ ఒకటే. నువ్వు ఆత్మలోనే ఉండి ఆత్మకు భిన్నంగా ఉన్నాను అనుకొంటున్నావు. గురువు చేసే సహాయం ఏమిటి అంటే నీకుఅంతర్‌దృష్టిని కలుగజేసి ఆభిన్నతలంపును, వేరుభావనను తొలగిస్తాడు. నీవు చేసే జపంవలన, ధ్యానంవలన దేహబుద్ధి తగ్గాలి. నీసాధనలవలన దేహబుద్ది పెరుగుతూ ఉంటే ఆసాధనలవలన ప్రయోజనం ఏముంది. నీవు మందులు వాడటం వలన నీరోగం తగ్గాలి అంతేగాని మందులు వాడటంవలన నీకు రోగం పెరుగుతూ ఉంటే ఆ మందులు వాడటం ఎందుకు అంటున్నారు. కొబ్బరికాయ తయారవ్వటానికి కొంతటైము పడుతుంది కాని అది పక్వానికి వచ్చినతరువాత చెట్టునుండి రాలటం కొన్నిక్షణాలలో రాలిపోతుంది. అలాగే నీసాధనకు కొంతటైము పడుతుంది. కాని లోపలఉన్న వస్తువు అనుభవంలోనికి రావటం కొన్నిక్షణాలలో జరిగిపోతుంది. భిన్నభావన నశించటం నీవు ఆనందంలో ఐక్యమవ్వటం ఇవన్నీ కొన్ని క్షణాలలో జరిగిపోతాయి. అయితే నీహృదయంలో ఉన్న నిజం దగ్గరకు వెళ్ళేవరకు కృషి విషయంలో నీకు అశ్రద్దపనికి రాదు. బట్టకు చిల్లులు పడితే ఆప్రక్కఉన్న మనుషులనుచిల్లులోనుండి కొంచెం కొంచెం చూడవచ్చు. అలాగే మూలతలంపు పూర్తిగా నశించకపోయిన అది కొంచెందారి ఇచ్చింది అనుకోండి లోపల ఉన్న వస్తువు తాలూక మాధుర్యాన్ని కొంచంరుచి చూసావు అనుకో మరల ఆఆనందాన్ని ఎప్పడు పొందుతాము, ఎప్పడు హృదయంలో మనం లయమవుతాము అని మనస్సు ఎదురుచూస్తుంది. నీకు ఆత్మజ్ఞానం కలిగినప్పడు, ఆత్మానందం నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు, నీవు ఆనందసముద్రంలో ఊగిసలాడుతున్నప్పడు దేవతలకు అధిపతి అయిన యింద్రుడుకూడా నిన్ను చూసి అసూయపడతాడు, అట్టిది జ్ఞానంయొక్క వైభవం అన్నారు ఆచార్యులవారు. మనం ఎప్పడైనా భగవాన్ దగ్గర బుడబుక్కల మాటలు మాట్లాడుతున్నాము అనుకోండి ఆయన బుడబుక్కల మాటలు అనరు, నువ్వుచెప్పేమాటలు జ్ఞానమా? అంటారు అంటే అది అజ్ఞానం అని చెప్పటం, అది వైభవం. వింటే జ్ఞానంగురించి విను. ఒకవేళ జ్ఞానం గురించి వినవు అనుకో అజ్ఞానం గురించి వినకు. ఒకమాట గుర్తుపెట్టుకోండి. లోపల ఉన్నసత్యం నీకు స్వరూపంగా వ్యక్తమయినప్పడు అంతకంటే పొందవలసింది వేరే ఉంది అనికాని, మనం సాధించవలసింది వేరేఉంది అనికాని, ఏదోవ్యాపకం పెట్టుకొందాము





అనిగాని, అలా ఉండాలి ఇలాఉండాలి అనికాని అసలు మీకు ఏమీ అనిపించదు, అట్టిది జ్ఞానం. జ్ఞానితాను ఏదో సంకల్పించి చెయ్యాలని వాడు చెయ్యడు. ఎందుచేతనంటే ఈశ్వరసంకల్పానికి భిన్నంగా జ్ఞాని ఉండడు, జ్ఞానిదేహంద్వారా పనిజరుగుతుంది. ఆఉపాధి ద్వారా జరగవలసినది ఏదో జరుగుతుంది అంతేగాని సంకల్పం ఏమీ అక్కడ ఉండదు. గురువు మనతో మాట్లాడుతూ ఉంటాడు, నవ్వుతూ ఉంటాడు, మనతో కలిసి తింటాడు కాని మనలను హృదయగుహలోనికి తీసుకొనిపోవటానికి చూస్తూఉంటాడు. ఈచూచేవాడిని, చూడబడే దానిని తప్పించి వాటిని ఓవర్‌కమ్ చేసి హృదయం యొక్క లోయలలోనికి, ఆ నగ్నసత్యం దగ్గరకు మోసుకొని పోవటానికి గురువు ప్రయత్నం చేస్తూ ఉంటాడు. ఓంకారం గురించి వేదాలు వర్ణించి చెప్పినాయి. కాని భగవాన్ ఏమంటున్నారు అంటే నీకు మూలతలంపు వచ్చాక ఓంకారం వచ్చిందా, మూలతలంపు రాకుండా ఓంకారం వచ్చిందా అంటున్నారు. మూలతలంపు వచ్చాక ఓంకారం వచ్చింది అయితే ముందు దానిని పట్టుకో. మూలతలంపును పట్టుకొని దానిని వెంటాడి దాని మూలంలోనికి వెళ్ళు అంటున్నారు భగవాన్.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 1-03-03, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడికి రూపంలేదు, నామంలేదు. కాని అవసరాన్ని బట్టి ఒకదేహం ధరించి వస్తాడు. దేహం ధరించినప్పడు కూడా నేను శరీరమాత్రుడను కాదు అని ఆయనకు తెలుస్తూ ఉంటుంది. ఈ రోజు శివరాత్రి. శివరాత్రి అంటే అవ్యక్తమైనటువంటి పరమాత్మ ఒక లింగరూపం ధరించినరోజు. లింగం అంటే గుర్తు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని గుర్తుకోసం లింగరూపం ధరించాడు. మనం దానిని పూజించి, ధ్యానించి, ఆరాధించి ఈ వ్యక్తమయిన లింగరూపం ద్వారా అవ్యక్తంలో ఐక్యమవ్వటంకోసం, మనకు సపోర్టుకోసం భగవంతుడు లింగరూపం ధరించాడు. శివుడు అంటే మంగళ ప్రదుడు, శుభాన్ని ఇచ్చేవాడు. శివస్మరణ వలన మనం పవిత్రులం అవుతాము. ఉపవాసం అంటే భగవంతుడికి దగ్గరగా ఉండమని, కాని మనం లోకానికి దగ్గరగా ఉంటున్నాము. మనకు దుఃఖం రావటానికి ఒకటే కారణం మనం లోకాన్ని భరించలేకపోతున్నాము. లోకంలో రకరకాల మనుషులు ఉంటారు. వాళ్ళందరిని ఎవరైతే సమన్వయం చేసుకోలేరో, లోకంయొక్క పోకడ ఎవరికైతే అర్థంకాదో వాడు లోకాన్ని భరించలేక దుఃఖపడతాడు. ఈశ్వరుడు అంటే ప్రభువు, నియమించేవాడు, జీవులను వారి కర్మానుసారం నియమిస్తూ